# తెలుగు యాంకర్సు:

'ముందొచ్చిన మన చెవులకంటే' మిగతా ప్రపంచం 'వెనకొచ్చిన కొమ్ముల్లా' వాడిగా ఉండొచ్చునేమోకానీ- వినోద ప్రదర్శనకి సూత్రధారులు అవసరమని మనవాళ్ళెప్పుడో గుర్తించారు. శతాబ్దాలక్రితమే మన నాటకాలకి పాత్రలతోపాటు సూత్రధారులూ ఉండేవారు. ఇప్పుడు వినోదానికి మారుపేరుగా ఉంటున్న టెలివిజన్ (బుల్లితెర)లోనూ సూత్రధారులు (anchors) ప్రధానపాత్ర వహించడం విశేషం.

ఆరంభంలో కేకలు. అరుపులు, వికృత చేష్టలతో- మన కార్యక్రమాలకు అనువుకాని పాశ్చాత్య పోకడలు పోయిన సూత్రధారులు ఎక్కువగా ఉండేవారు. అలాంటివారు ఇప్పటికీ కొందరున్నారు కానీ- సహజప్రతిభను ప్రదర్శించిన సూత్రధారుల్లో ఆద్యులుగా- సిద్ధార్థ కక్, రేణుకా సహానీలని (హిందీ దూరదర్శన్‌లో 'సురభి' కార్యక్రమం) చెప్పుకోవచ్చు. 1995లో అచ్చతెలుగు ఛానెల్ ఈటీవీ ఆవిర్భవించేక- తెలుగు నాట సూత్రధారుల ఊపందుకుంది. తమదంటూ ఒక శైలిని సృష్టించుకుని సూత్రధారుల్లో 'మిలమిల తారలు'గా వెలుగొందుతున్న వారి గురించి క్లుప్తంగా:

**ఝాన్సీ:** తెలుగింటి ఆడపడుచులా, సింపుల్‌గా ఉంటుంది. చక్కని తెలుగు మాట్లాడుతుంది. కార్యక్రమానికి అనుగుణంగా తన్నుతాను మలచుకుంటుంది. మంచి నటి. తన నటనా సామర్థ్యాన్ని కార్యక్రమాలకు అన్వయించే తీరు అపురూపం. జెమినిలో శుభోదయం, టాక్ ఆఫ్ ది టౌన్; మా టీవీలో పెళ్ళి పుస్తకం; ప్రస్తుతం ఈటీవీలో బ్లాక్- ఆమె బహుముఖప్రజ్ఞకి మచ్చుతునకలు.

**ఉదయభాను:** పొడగరి ఐనా సొగసరి. అడపాతడపా కనిపించే మేరకు సినీనటి. ఆధునిక దుస్తులు ధరించినా- అచ్చమైన తెలుగు- ఆమె నోట సహజ ప్రవాహమై సాగుతుంది. ఈటీవీ 'హృదయాంజలి', జెమిని (వేణు మాధవ్‌తో కలిసి) 'వన్స్ మోర్ ప్లీజ్', జీ తెలుగు 'నీ ఇల్లు బంగారం కానూ'- ఆమె విలక్షణతకి ఉదాహరణలు. అందం, గ్లామర్ కలిసిన ఈ సూత్రధారిణి అప్పుడప్పుడు 'చాలా హాట్ గురూ' అనిపిస్తుంది. ప్రస్తుతం జెమిని 'జాణవులే నెర జాణవులే'లో మకుటాయమానం అనిపిస్తోంది. ఈటీవీ 'ఢీ'లో అందమైన జోరుని స్వరం హోరు 'ఢీ'కొనడం కాస్త బోరు. సమయస్ఫూర్తి, సంభాషణా సౌలభ్యం ఈమె ప్రత్యేకతలు.

**సుమ:** మాతృభాష తెలుగు కాదుట కానీ- అచ్చతెలుగు అమ్మాయిలా కనిపిస్తూ, అచ్చతెలుగు భాష వినిపిస్తూ- అందంగా, సింపుల్‌గా ఉంటుంది. కొంత మేకప్ చేసుకున్నా- అమ్మాయిలకి పక్కింటమ్మాయనీ,

అబ్బాయిలకి ఇంటి ఆడపడుచనీ అనుకునేలా ఉంటుంది. వర్షంవంటి హిట్ సినిమాల్లో కనిపించినా- సూత్ర ధారిణి పాత్రకే ప్రాధాన్యమిచ్చింది మరి. యాంకరింగులో నటనను మేళవించినా- తెలియనివ్వదు. తెలుగు సామెతలు, పద్యాలు- తెలుగుతనం నిండిన ఉచ్చారణతో సందర్భానుసారంగా చెప్పడం ఈమె ప్రత్యేకత. ఇప్పటికీ చిన్న పిల్లలా కనిపించే ఈ బిడ్డ తల్లి- ఈటీవీ 'స్టార్ మహిళ'కి స్టార్ మహిళ.

**సునీత:** తెలుగింటి ఆడపడుచు. అలాగే కనిపిస్తుంది. పొరుగింటి సినీ ఆడపడుచుని తెలుగింటి ఆడపడు చులా వినిపిస్తుంది (ఈమె సుప్రసిద్ధ డబ్బింగ్ ఆర్టిస్ట్). కావ్యభాషని కమనీయంగా పలికే జిహ్వ ఆమె ప్రత్యేకత. గాయనిగా దేశవిదేశాల్లో పురస్కారాలందుకున్న ఆమె- ఎన్నో సంగీత ప్రధానమైన కార్యక్రమా లకు సూత్రధారిణి. ఈటీవీ 'ఝుమ్మంది నాదం' ఆమె అభిరుచికి మచ్చుతునక. చెరగని చిరునవ్వు అమె ముఖానికి ప్రత్యేకాలంకారం. అదే నవ్వు కాస్త ఎక్కువై కృత్రిమత్వాన్ని స్ఫురింపజేయడం, మాటల్లో చర్వి తచర్వణం, సమాధానాల్లో సమయస్ఫూర్తి లోపం- సూత్రధారిణిగా ఆమె సరిదిద్దుకోవాల్సిన అంశాలు.

**శిల్పా చక్రవర్తి:** ఆమె బెంగాలీ అమ్మాయి. చెబితే అలాగే కనిపిస్తుంది కూడా. కానీ గళం విప్పితే- తెలుగ మ్మాయి కాదని చెప్పినా నమ్మడం కష్టం. ఇక్కడే పుట్టి పెరిగిన అమ్మాయిలా చక్కని తెలుగు మాట్లాడు తూ, కార్యక్రమాన్ని 'ఉల్లాసంగా ఉత్సాహంగా' నడిపించడంలో తనదంటూ ఓ బాణీ ఏర్పరచుకున్న ఈమె ఎన్నో ప్రముఖ సినీ కార్యక్రమాలకు కూడా సూత్రధారిణిగా కనిపిస్తూంటుంది.